# విశ్వనాథ పురాణవైర గ్రంథమాల

# పరిచయ వ్యాసములు

టి. శ్రీవల్లీ రాధిక

# 1. భగవంతుని మీది పగ

పురాణవైర గ్రంథమాలలో ఇది మొదటి నవల. ఇందులో భారత యుద్ధమైన తర్వాత వంద ఏళ్ళు గడిచిన నాటి కథ వ్రాయబడింది. అప్పుడు జనమేజయ మహారాజు తుంగభద్ర ఒడ్డున కొందరు మునులకు కొంత స్థలము దానం చేశాడట. ఆ దానశాసనం వుందట. అంతకన్నా ప్రమాణమేమి కావాలి? అంటారు విశ్వనాథ ఈ నవల పీఠికలో.

ఈ మొదటి నవలలో ప్రధానంగా ఆంధ్ర దేశమే వర్ణింప బడింది. ఆంధ్ర రాజు రోమపాదుడికి ముగ్గురు కొడుకులు – శ్రీముఖుడు, విజయసింహుడు, నాగార్జునుడు. శ్రీముఖుడు యువరాజు. విజయసింహుడు ఖడ్గవిద్యలో మహా నిపుణుడు.

కాళింది, భామ, నీల ఈ రాకుమారుల భార్యలు. ముగ్గురు రాకుమారులవీ, వారి భార్యలవీ కూడా మూడు రకాల స్వరూపాలు, స్వభావాలు. నిరంకుశుడు, జయద్రథుడు అనేవి మరో రెండు ముఖ్యమైన పాత్రలు.

నిరంకుశుడు రాజబంధువు. నిరంకుశుడి తండ్రి ముగ్గురు రాకుమారులకూ, నిరంకుశుడికీ, అతని చెల్లెలు జాంబవతికీ కూడా ఖడ్గ విద్య నేర్పిన గురువు. ఖడ్గవిద్య విషయంలో నిరంకుశుడి మనసులో విజయసింహుడి పట్ల మొదటి నుండీ కొంత స్పర్ధ వుంటుంది. అది ఆ తర్వాతి కాలంలో విజయసింహుడు జాంబవతితో వివాహేతర సంబంధాన్ని ఏర్పరచుకోవడంతో ద్వేషంగా మారుతుంది. విజయసింహుడిని సంహరించే ధ్యేయంతోనే అతడు గంగు అనే గొల్లవాని వద్ద ఒక క్షుద్రవిద్యను సైతం అభ్యసిస్తాడు. ఇక జయద్రథుడి గురించి.

మహాభారత యుద్ధ సమయంలో సింధు దేశపు రాజయిన జయద్రథుడు (సైంధవుడు) అర్జునుడి చేతిలో మరణిస్తాడు. దానికి సంబంధించిన పథక రచన అంతా శ్రీకృష్ణుడిది. అయితే ఈ విషయంగా సైంధవుని భార్య అయిన దుస్సలకి గాని, ఆమె కొడుకుకి కాని పగ లేదు. యుద్ధం తర్వాత ధర్మరాజు అశ్వమేధయాగం చేసిన సందర్భంలో అర్జునుడు దిగ్విజయం చేయడానికి వెళ్ళినపుడు దుస్సల తన కొడుకుని తెచ్చి అర్జునుడి పాదాల మీద వుంచి ప్రాణదానం కోరుతుందట. ఆ కుమారుడు పెద్దవాడయ్యి సింధుదేశాన్ని పాలిస్తాడట. ఆ తర్వాత, అంటే ఈ కథా కాలం నాటికి సైంధవుడి మనుమడూ పాలిస్తుంటాడట.

వారెవ్వరికీ లేని పగ సైంధవుడి మేనల్లుడయిన కనకసింహుడికి వుంటుంది. ఆ కనక సింహుడికి ఒక కూతురు వుంది. ఆమెకు తన మేనమామ భార్య అయిన దుస్సల పేరు పెడతాడతను. మ్లేచ్ఛ సంఘాచారములందు అతనికి పరమాభిమానము. వైదిక ధర్మము మీద పగ.

అతడు తన కూతురయిన దుస్సలకి ఆ పగ సాధించడమే జీవిత పరమావధిగా నిర్ణయిస్తాడు. అతడు చేసిన నిర్ణయమేమిటంటే తన కూతురయిన దుస్సల, ఆమె సంతానము వైదిక మతాన్ని వదిలిపెట్టరు. అందులోనే వుండి లోపలినుంచి ఆ మతానికి ఎంత అపకారం చేయాలో అదంతా చేస్తారు. ఆ కనకసింహుని కూతురయిన దుస్సల భర్త పేరు రామతుడు. పగ తీర్చుకోవడానికి వాళ్ళు ఒక సంప్రదాయమేర్పరుస్తారు. అదేమిటంటే... రామతుడికీ, దుస్సలకీ ఒక కొడుకు పుడతాడు. వాడి పేరు జయద్రథుడు. వాడు పెళ్ళి చేసుకుంటాడు. ఆ పెళ్ళి చేసుకున్న స్త్రీ పేరుని దుస్సల

# 3. ధూమరేఖ

పురాణవైర గ్రంథమాలలో ఇది మూడవ నవల. రెండవ నవల నాస్తికధూమములో మగధరాజ్యం ప్రద్యోత వంశం వారి చేతిలోకి వెళ్ళడం చెప్పబడింది. ఈ మూడవ నవలలో శిశునాగ వంశం రాజ్యానికి రావడం చెప్పబడుతుంది.

ప్రద్యోత వంశము కలియుగమున పదకొండువందల నలభై నాలుగేళ్ళ వరకు రాజ్యం చేసింది. ప్రద్యోతులు అయిదుగురు. ప్రద్యోతులలో చివరివాడు నందివర్ధనుడు. అతని తర్వాత కలిలో పదకొండువందల నలభై నాలుగేళ్ళ నుంచి పదిహేనువందల నాలుగు వరకు గిరివ్రజపురం రాజధానిగా శిశునాగ వంశం రాజ్యం చేసింది. శిశునాగ వంశంలో చివరివాడు మహానంది. మొదటివాడు శిశునాగుడు.

ఈ నవల మొదట్లో ఇద్దరు యువతుల మనఃప్రవృత్తి వర్ణింపబడుతుంది. వారిలో మాయ అన్న ఆమె బుద్ధుని తల్లి. ఈ నవలలో బుద్ధుని కథ లేదు. దానికి సూచన వుంది. దానికి పునాదిగా ఈ నవలలోని కథ వ్రాయబడింది అంటారు విశ్వనాథ పీఠికలో. పురాణవైర గ్రంథమాల లోని మొదటి మూడునవలలలో అభౌమకత (super natural) విషయము వర్ణింప బడింది. తక్కిన నవలలో ఆ ప్రసక్తి వుండదు అని చెప్తారు.

కథలోకి వెళ్తే ... శిశునాగుడు కాశీరాజు కుమారుడు. ప్రద్యోత వంశములోని అయిదవరాజైన నందివర్ధనుడు, శిశునాగుడు పినతల్లి పెదతల్లి బిడ్డలు. నందివర్ధనునకు పురుష సంతానం లేదు. ఒక్కతే కూతురు. ఆమె పేరు వేదమరీచి. ఆమె పుట్టినపుడే ఆమె తల్లి చనిపోయింది. తల్లి దుఃఖమును మరచిపోవడానికి కాశీరాజు ఆమెని కాశీ నగరానికి తీసుకెళ్ళాడు.. (ఇక్కడ ఒకచోట కాశీరాజు భార్య నందివర్ధనుడికి వదినగారని వ్రాశారు. కాశీరాజు భార్య అంటే శిశునాగుడి తల్లే కదా! శిశునాగుడి తల్లి నందివర్ధనునికి వదినగారు కాదు, పెదతల్లి. నవలలో అన్ని చోట్ల అలాగే చెప్పారు. ఇక్కడ ఒక్క చోట వదినగారు అని వ్రాయడం పొరపాటు కావచ్చు.) అప్పటికి శిశునాగుడు కొంత చిన్నవాడు. శిశునాగుడు, వేదమరీచి కలిసి ఆడుకునేవారు. ఒకరంటే ఒకరు ఇష్టంగా వుంటారు. మొదట అది పినతండ్రి, కూతుళ్ళ బంధం గానే వున్నా తర్వాత పక్కదోవ పడుతుంది.

యుగపురుషులు నిత్యులు. ఎవనికి వీలైనప్పుడు వాడు విజృంభించును. కలిపురుషుడు మొదట జయద్రథుని యందు తాను కొంత సంక్రమించెను. కానీ తాను విస్తరించటానికి నాడు కాలం అనుకూలంగా లేదు. శిశునాగుని నాటికి కలిపురుషునికి కొంత బలం వచ్చింది. జయద్రథుడు తన శరీరాన్ని దగ్ధం చేసుకోగా (రెండవ నవల నాస్తిక ధూమము ముగింపులో చెప్పబడిన విషయం) వ్యాపించిన ధూమరేఖల నుండి కలి కూడా వ్యాపించింది. (పురాణవైర గ్రంథమాలలోని మొదటి పుస్తకం – భగవంతుని మీది పగ – లో జయద్రథుని గురించీ, ఆ వంశం వారి పగ గురించీ చెప్పబడింది.)

ప్రతిమనిషికీ పుట్టుకతోనే ఒక సంస్కారం వుంటుంది. అది ధర్మం కావచ్చు. అధర్మమూ కావచ్చు. శిశునాగునిలో అలాంటి అధర్మమైన సంస్కారం వుంది. వేదమరీచి పందొనిమిదేళ్ళు వచ్చేవరకు కాశీనగరం లోనే వుంది. అప్పుడప్పుడు గిరివ్రజపురానికి వచ్చి పోతూ వుంది. భార్యని అమితంగా ప్రేమించిన నందివర్ధనుడు మళ్ళీ వివాహం

# 7. అమృతవల్లి

ఇది ఏడవ నవల. ఆరవ నవల అయిన అశ్వమేధము శుంగ వంశపు రాజైన పుష్యమిత్రుడు రాజ్యానికి వచ్చిన కథని చెప్తుంది. ఈ శుంగవంశపు రాజులు పదిమంది. వారిలో చివరి రాజు దేవభూతి. అతనికే క్షేమభూతి అనే పేరు కూడా వుంది.

ఈ క్షేమభూతి కాముకుడై రాజ్యాన్ని మంత్రులకి అప్పగించి దుష్టముగా ప్రవర్తిస్తూ ఉంటాడు. ఆయన మంత్రి వాసుదేవుడు. ఈ వాసుదేవుడు కాణ్వాయన బ్రాహ్మణ వంశమునకు చెందినవాడు. ఈ కథ కలియుగ రాజవృత్తాంతములో, భాగవతంలో వుంది. దానికి కొంత కల్పన జోడించి ఈ నవల వ్రాశారట విశ్వనాథ సత్యనారాయణగారు.

దేవభూతి తన మంత్రి అయిన వాసుదేవుని కూతురు అందగత్తె అని విని, ఆమెను నమ్మకము మీద పిలిపించి, ఆమె భర్తను చంపించి, ఆమె భర్త వేషమును తాను వేసుకుని ఆమె వద్దకు పోవడం, ఆమె అతనిని నిరాకరించడం, అతడు బెదిరించగా ప్రాణాలు వదలడం జరుగుతుంది. ఆ వార్త విన్న వాసుదేవుడు దుఃఖించి, రాజు మీదకి విషకన్యను ప్రయోగించి రాజును చంపుతాడు. – ఇది కథ.

కథలోని విషాంగన వారాంగన. ఈ నవలలోని విషాంగన ఈ కథలోని నాయిక అయిన అమృతవల్లి. ఆమె కూడా బ్రాహ్మణ స్త్రీయే.

ఈ విషయమంతా పీఠికలోనే వివరించబడుతుంది. నవల శ్రీమాలి, అమృతవల్లి అనే ఇద్దరు స్నేహితురాళ్ళ మాటలతో ప్రారంభమవుతుంది. శ్రీమాలి తండ్రి వాసుదేవుడు కోసల రాజ్యమునుండి వచ్చాడు. అమృతవల్లి తండ్రి హరిసేనుడు మిథిల నుండి వచ్చాడు. వాసుదేవుడు మగధరాజ్యానికి మహాసేనాధిపతి. హరిసేనుడు ఒక చిన్న ప్రభువు.

ఈ స్నేహితురాళ్ళు ఇద్దరూ అక్కచెల్లెళ్ళు కాకపోయినా చూడటానికి ఒకేలా వుంటారు. కానీ రూపంలో ఎంత సామ్యమున్నా మనసులలో చాలా భేదం వుంది. అది వారి ప్రవర్తనలో కనిపిస్తూనే వుంటుంది. ఒకరు లేడి అయితే మరొకరు చిరుతపులి. వీళ్ళని గురించిన ఈ పరిశీలన విదురుడు అనే వృద్ధునిది. అతడు గిరివ్రజపురంలో వుండే ఒక శూద్ర వృద్ధుడు. పిల్లలంటే అతనికి ముద్దు. ఎప్పుడూ ఎందరో పిల్లలు అతని చుట్టూ చేరి అతను చెప్పే కథలు, కబుర్లూ వింటూ వుంటారు. అతని తమ్ముడు జయద్రథుడు. ఆ అన్నదమ్ములిద్దరూ కూడా భిన్న ధ్రువాలు. నవలలో జయద్రథుడు నేరుగా మనకి పరిచయం కాడు. ఇతరుల సంభాషణల ద్వారానే చెప్పబడతాడు. ఆ జయద్రథుడి దగ్గరకి శ్రీమాలి ఎక్కువగా వెళ్ళదు కానీ అమృతవల్లి వెళ్తూ వుంటుంది.

ఈ స్నేహితురాళ్ళు చెప్పుకునేవి మామూలు కబుర్లు కావు. పెద్ద పెద్ద చర్చలు, విశ్లేషణలు. మొదటి ఘట్టంలోనే వారి సంభాషణ ఇలా వుంటుంది–

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Viswanatha+Puranavaira+Granthamala+Parichaya+Vyasamulu**

* * *